తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ గుర్తులను నెమరువేసుకునేలా, నాటి ఉద్యమ స్ఫూర్తిని రగిలించేలా... యువతను భాగస్వామ్యం చేస్తూ ఈ నెల 29వ తేదీన దీక్షా దివస్‌ను ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అన్న నినాదంతో ప్రాణత్యాగానికి సిద్ధపడి నాటి ఉద్యమ నేత కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్షతోనే తెలంగాణ రాష్ట్రానికి శ్రీకారం చుట్టారన్న విషయాన్ని మరోసారి దీక్షా దివస్ ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్న సంకల్పాన్ని ప్రకటించింది. అందుకే దీక్షా దివస్‌ను ఈ నెల 29వ తేదీన అన్ని జిల్లా కేంద్రాల్లో ఘనంగా వేలాది మందితో నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఉమ్మడి జిల్లాలోని అన్ని జిల్లా కేంద్రాల్లో మంగళవారం దీక్షా దివస్ సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేశారు. దీనికి ఆయా జిల్లా ఇన్‌చార్జిలతో కలిసి మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు. దీక్షా దివస్ రోజున ఆనాటి ఉద్యమ స్మృతులను గుర్తు చేసేలా ఫొటో ఎగ్జిబిషన్లను, వీడియోలను సైతం ప్రదర్శించేలా చూడాలని నేతలకు సూచించారు.

– నల్లగొండ ప్రతినిధి, నవంబర్26(నమస్తే తెలంగాణ)/నల్లగొండ

నాటి స్ఫూర్తిని రగిలించేలా...

దీక్షా దివస్

- ఈ నెల 29న వేలాది మందితో కార్యక్రమం
- కేసీఆర్ ఆమరణ దీక్షతోనే రాష్ట్ర సాధన
- సచివాలయంపై తెలంగాణ పదం కేసీఆర్ పుణ్యమే
- ఉద్యమనేత త్యాగాన్ని ప్రజలకు గుర్తు చేయాలి
- నేటి తరానికి ఉద్యమ చరిత్రను అందించాలి
- దీక్షా దివస్‌లో యువతకు ప్రాధాన్యతనివ్వాలి
- నల్లగొండ సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఇన్‌చార్జి మన్నె శ్రీనివాసరెడ్డి
- మాజీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో భారీగా తరలివచ్చిన పార్టీ నేతలు, కార్యకర్తలు

నల్లగొండ బీఆర్ఎస్ కార్యాలయంలో గాంధీ, అంబేద్కర్ చిత్ర పటాలకు పూలమాల వేసి సన్నాహక సమావేశాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, దీక్షా దివస్ ఇన్‌చార్జి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు

నల్లగొండ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో దీక్షా దివస్ సన్నాహక సమావేశం పార్టీ జి ల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. దీనికి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డితోపాటు కార్యక్రమ జిల్లా ఇన్‌చార్జి, మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకాగా ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ బండ, మాజీ ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, రాష్ట్ర, జిల్లా ముఖ్య నేతలంతా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో శాసనసభలో తెలంగాణ అన్న పదాన్నే నిషేధించాలని చూడగా.. అదే తెలంగాణ పేరుతో తెలంగాణ సచివాలయాన్ని నిర్మించిన రాష్ట్ర సాధకుడు, తొలి సీఎం కేసీఆర్ సరికొత్త చరిత్రను లిఖించారన్నారు. దేశానికి స్వాతంత్ర్యం కావాలన్న ఆకాంక్ష 1857లోనే సిపాయిల తిరుగుబాటుతో మొదలైతే గాంధీజీ అహింసా మార్గంలో సాధించిన విధంగానే కేసీఆర్ అంతకుముందు నడిచిన ఉద్యమాలు, వాటిపై నిర్బంధాల నుంచి సరైన దిశలో ఆలోచన చేసి రాష్ట్రాన్ని సాధించుకొచ్చారని చెప్పారు. 2001లో నా స్వప్నం.. నా ధ్యేయం తెలంగాణ రాష్ట్ర సాధననే అని బయల్దేరిన కేసీఆర్... 2009 నవంబర్ 29న కేసీఆర్ సచ్చుడో... తెలంగాణ వచ్చుడో అన్న నినాదంతో ప్రాణత్యాగానికి సిద్ధపడి రాష్ట్రాన్ని సాధించారని గుర్తు చేశారు. 14 ఏండ్లు అలుపెరుగని పోరాటంతో ప్రాణాలను పణంగా పెట్టి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌పై ప్రత్యర్థులు దుర్మార్గంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్తల కడుపుమాడ్చి... ప్రజల కడుపు నింపడమే ధ్యేయంగా కేసీఆర్ పాలన కొనసాగిందని గుర్తు చేశారు. ఏడాది తిరక్కముందే కాంగ్రెస్ పాలనతో విసిగిపోయిన ప్రజలు కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటున్నారన్నారు. కేసీఆర్ నాయకత్వాన్ని నిలబెట్టుకోవడంలో, ఆయన త్యాగాన్ని ప్రజలకు వివరించడంలో వైఫల్యాలు ఉండకూడదన్నారు. ఉద్యమకాలం నాటి ఘటనలను, కేసీఆర్ త్యాగాలను, రాష్ట్ర సాధన పోరాటాన్ని నేటి తరానికి మనం వారసత్వంగా అందించాల్సిన కర్తవ్యం మన ముందుందని తెలిపారు. కేసీఆర్ లేకుంటే అసలు తెలంగాణ పదమే లేదన్న విషయాన్ని నేటి యువతకు చాటిచెప్పాలని పిలుపునిచ్చారు. దీక్షా దివస్‌ను నాటి తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని రగిలించేలా, పెద్ద ఎత్తున యువతను భాగస్వామ్యం చేసేలా నిర్వహించాలని సూచించారు. దీని కోసం ప్రతి గ్రామం నుంచి యువత తరలివచ్చి దీక్షా దివస్‌లో పాల్గొనేలా పార్టీ నేతలు చర్యలు చేపట్టాలన్నారు. ఈ నెల 29న జిల్లా కేంద్రాల్లో భారీ ఎత్తున వేలాది మందితో దీక్షా దివస్‌లు విజయవంతం చేయాలని, ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేషన్ల చైర్మన్లు రామచంద్ర నాయక్, పల్లె రవికుమార్, దూదిమెట్ల బాలరాజు యాద వ్, మాజీ గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, ఐసీడీఎస్ మాజీ ఆర్వో మాలె శరణ్యారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, నాయకులు చెరుకు సుధాకర్, కటికం సత్తయ్య గౌడ్, నిరంజన్ వలీ, బోనగిరి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

దీక్షా దివస్‌కు భారీగా కదలాలి : మాజీ ఎంపీ, నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మన్నె శ్రీనివాస్‌రెడ్డి

తెలంగాణను సాధించి, దాని రూపురేఖలే మార్చి, దేశంలోనే అద్భుతంగా అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దే. అట్లాంటి కేసీఆర్ మీద లేనిపోని కల్లబొల్లి కథలు చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దేశంలోనే గొప్పగా అభివృద్ధి చెందిన తెలంగాణ రాష్ట్రాన్ని అనాలోచిత నిర్ణయాలతో సీఎం రేవంత్‌రెడ్డి ఆగం చేస్తున్నాడు. అందుకే ఏడాది తిరగక ముందే ప్రజలు కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటున్నారు. ఆనాటి ఉద్యమ గుర్తులను, కేసీఆర్ త్యాగాలను మరోసారి ప్రజల్లోకి తీసుకెళ్లేలా దీక్షా దివస్‌ను ఘనంగా నిర్వహించేందుకు అందరూ కృషి చేయాలి. ప్రతి నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలి.

కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ సాధన : దీక్షా దివస్ సూర్యాపేట ఇన్‌చార్జి, నల్లగొండ జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి

కేసీఆర్ చేసిన దీక్షతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. ఉమ్మడి రాష్ట్రంలో అన్ని రంగాల్లో వివక్షకు గురైనందునే కేసీఆర్ ప్రత్యేక రాష్ట్రం సాధించాలని నడుము కట్టి ముందుకు సాగారు. చావు నోట్లో తలకాయ పెట్టిన కేసీఆర్ దీక్షతోనే నాడు కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి తెలంగాణ ఇచ్చిందని, ఈ విషయాన్ని మరోసారి ప్రతి ఒక్కరికి తెలియచేయాల్సిన అవసరం ఉంది. మార్పులో భాగంగా ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే ఇప్పుడు అన్ని రంగాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణను పదేండ్ల పాటు అభివృద్ధి చేస్తే నేడు కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు కమీషన్ల కోసం కక్కుర్తి పడుతున్నారు.

ఏడాదిలోనే వ్యతిరేకత మూట కట్టుకున్న కాంగ్రెస్ : నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి



బీఆర్ఎస్ పదేండ్లు అధికారంలో ఉండి అన్ని వర్గాల కడుపులు నింపితే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ ఏడాదిలోనే తీవ్రమైన వ్యతిరేకత మూట కట్టుకున్నది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెడితే బీఆర్ఎస్ బంపర్ మెజారిటీతో గెలుపొందుతుంది. ఈ నెల 29న నిర్వహించే దీక్షా దివస్‌ను చూసి కాంగ్రెసోళ్లు వణికిపోవాలన్నారు. పార్టీ మారిన వాళ్లు అందులో ఇమడలేక ఎంతో ఇబ్బంది పడుతున్నారు. బీఆర్ఎస్‌లో ఉన్న వారే స్వేచ్ఛగా, సంతోషంగా ఉన్నారు.

పెద్ద ఎత్తున జన సమీకరణ చేయాలి : మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు



ఈ నెల 29న నల్లగొండలో నిర్వహించే దీక్షా దివస్‌కు పెద్దఎత్తున తరలిరావాలి. మిర్యాలగూడ నుంచి వెయ్యి మంది కార్యకర్తలు ఈ దివస్‌కు రావాలి. కేసీఆర్ చేసిన ఉద్యమం, ఆయన పోరాట పటిమ ప్రతి ఒక్కరూ మరోసారి మననం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన త్యాగాల మీద పుట్టిన తెలంగాణ ఇవ్వాళ స్వరాష్ట్రంలో ఎన్నో విజయాలు సాధించింది. గొప్ప తెలంగాణను ఏడాదిలో రేవంత్ సర్కార్ నాశనం చేశారు.

కేసీఆర్ లేకపోతే రేవంత్ సీఎం అయ్యేటోడా : మునుగోడు మాజీ ఎమ్మెల్యే, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి



కేసీఆర్ లేకపోతే తెలంగాణ వచ్చేదా, తెలంగాణ రాకపోతే రేవంత్ రెడ్డి సీఎం అయ్యేటోడా ? తెలంగాణ రాష్ట్ర సాధన వల్లే రేవంత్ సీఎం అయింది నిజం కాదా అని, ఆయన ఆ విషయాన్ని మరిచి అడ్డగోలుగా మాట్లాడటం సరికాదు. అభివృద్ధి చేయడం చేతకాని కాంగ్రెస్ సర్కార్‌కు మాటలు తప్ప సాధించింది ఏమి లేదనే విషయం ప్రజలకు అర్థమైంది. చేతగాని ప్రభుత్వాన్ని ప్రజా క్షేత్రంలో నిలదీయాలి.

నల్లగొండలో బీఆర్ఎస్ దీక్షా దివస్ సన్నాహక సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ ముఖ్య నేతలు, కార్యకర్తలు

సూర్యాపేటలో దీక్షా దివస్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్, పక్కన మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, పార్టీ రాష్ట్ర నాయకులు

తెలంగాణ సాధన విశేషాలు

యువతరానికి తెలియాలి

- మోసాలు, ద్రోహులకు ఎదురొడ్డి ఎలా నిలబడ్డారో చెప్పాలి
- రాష్ట్ర సాధనకు కీలక మలుపు నవంబర్ 29 దీక్షా దివస్
- సూర్యాపేట సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు

సూర్యాపేట, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ) : 'తెలంగాణ ఉద్యమ సమయంలో నాటి ఉద్యమ నేత కేసీఆర్ ఎన్ని ఇబ్బందులు పడ్డారు... ఉద్యమాన్ని నిలబెట్టేందుకు ఎన్ని సార్లు మోసాలకు గురయ్యారు... ఎన్ని ద్రోహాలు జరిగాయి.. ఎన్ని అడ్డంకులు వచ్చినా తట్టుకొని ఆరు దశాబ్దాల తెలంగాణ ప్రజల ఆకాంక్ష ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఎలా సాధించారు అనే విషయాలను నేటి యువతరానికి తెలియజేయాల్సిన బాధ్యత బీఆర్ఎస్ పార్టీగా మనందరిపైనా ఉంది' అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ చచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అంటూ దీక్షకు కూర్చున్న రోజు నవంబర్ 29 కాగా అదే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఒక కీలకమైన రోజని తెలిపారు. ఈ నెల 29న చేపట్టే దీక్షా దివస్ విజయవంతం కోసం మంగళవారం సూర్యాపేటలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి సన్నాహక సమావేశానికి జగదీశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పద్నాలుగేండ్లు బొబ్బిలిలా ఉద్యమించి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ అదే ఉద్యమ స్ఫూర్తితో పదేండ్లలోనే అభివృద్ధి, సంక్షేమాలను చేపట్టి దేశానికే తెలంగాణ రాష్ట్రాన్ని రోల్‌మోడల్‌గా నిలిపారన్నారు. 2001లో తెలంగాణ ఉద్యమం ప్రారంభం కాగా రాష్ట్ర సాధన సమయంలో చిన్నారులుగా ఉన్న వారు మొన్నటి ఎన్నికల్లో ఓటు హక్కు పొందారని, వచ్చే ఎన్నికల్లో ఓట్లు వేసేందుకు సిద్ధమయ్యే వారికి కేసీఆర్ ఉద్యమ చరిత్రను వివరించాలన్నారు. గత ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లోనే 60 స్థానాలు పోగొట్టుకున్నామని, దానికి కారణం యువతరం వచ్చి గ్రామాల్లో తిరిగి ఓట్లు అవతలి వారికి వేయించారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దీపికాయుగంధర్‌రావు, జిల్లా గ్రంథాలయ మాజీ అధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ గౌడ్, మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, జిల్లా రైతు బంధు సమితి మాజీ అధ్యక్షులు రజాక్, నాటి ఉద్యమ కారులు దావుల వీరప్రసాద్‌యాదవ్, కల్లెట్లపల్లి శోభన్‌తో పాటు మాజీ జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సింగిల్‌విండో చైర్మన్‌లు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యువత పెద్ద ఎత్తున తరలిరావాలి : బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్

ఈ నెల 29న సూర్యాపేట జిల్లా కేంద్రంలో చేపట్టబోయే దీక్షా దివస్‌ను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలి. ప్రధానంగా ఉద్యమ సమయంలో తొమ్మిది నుంచి పదేండ్ల వయసున్న వారికి ఉద్యమం, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి తెలియదని అలాంటి యువతరం పెద్ద సంఖ్యలో వచ్చేలా బీఆర్ఎస్ శ్రేణులు చొరవ తీసుకోవాలి.

కలిసికట్టుగా గులాబీ జెండాను ఎగరేయాలి : తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్

కార్యకర్తల్లో ఉన్న చిన్న చిన్న మనస్పర్థలను వదిలేసి అందరూ కలిసికట్టుగా ఉండి వచ్చే ప్రతి ఎన్నికల్లో గులాబీ జెండాను ఎగరేయాలి. ప్రతి కార్యకర్త పార్టీని బలోపేతం చేయాలని, దాంతోనే విజయం సులభతరం అవుతుందని తెలిపారు. దీక్షా దివస్‌తో కేసీఆర్ చావునోట్లో తలకాయ పెట్టి ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేయడం వల్లనే రాష్ట్ర సాధన సులభమైంది. ప్రస్తుతం తెలంగాణలో నిరాటంకంగా వస్తున్న విద్యుత్, నీళ్లతో పాటు సకల సౌకర్యాలు ఎప్పటి నుంచి ఎలా వస్తున్నాయి, వీటన్నింటినీ సాధించిన కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ ప్రాశస్త్యాన్ని యువతరానికి తెలియజేయాలి.

యువతకు దీక్షా దివస్ గురించి తెలియాలి : దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్

ఈ నెల 29న నల్లగొండలో నిర్వహించే దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి. ప్రతి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో వచ్చి నేటి యువతరానికి దీక్షా దివస్ అంటే ఏమిటో తెలియచేయాలి. కేసీఆర్ చేపట్టిన దీక్ష వల్ల అప్పట్లో కేంద్రమే కదిలివచ్చి తెలంగాణ ఇచ్చిన విషయాన్ని యావత్ దేశానికి మరోసారి చాటాల్సిన బాధ్యత బీఆర్ఎస్ సైనికులపై ఉన్నది. రాష్ట్రం సాధించాక పదేండ్ల పాలనలో కేసీఆర్ అన్ని వర్గాలకు మంచి ఫలితాలు ఇచ్చారు. ఈ విషయం మరోసారి తెలియచెప్పాల్సిన బాధ్యత మనపై ఉంది.

ప్రతి గ్రామంలో కేసీఆరే కనిపిస్తుండు : నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

ఇవ్వాళ ఏ గ్రామానికి వెళ్లినా కేసీఆర్ చేసిన అభివృద్ధే కనిపిస్తున్నది. ప్రతి నెలా పంచాయతీలకు నిధులు ఇచ్చి వైకుంఠ ధామం నుంచి నర్సరీల వరకు నిర్మాణాలు చేపట్టి స్వచ్ఛ పల్లెలుగా కేసీఆర్ తీర్చిదిద్దారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఆరు గ్యారెంటీలు ఇవ్వలేదని, 420 హామీల ఊసే లేదు. కేసులు పెట్టి భయపెట్టే కాంగ్రెసోళ్లు పాలన గాలికి వదిలేశారు.. కేసులకు భయపడే ప్రసక్తే లేదు.

పార్టీ అభివృద్ధి కోసం బీఆర్ఎస్ సేన సిద్ధమవ్వాలి : నాగార్జున సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

పార్టీ అభివృద్ధి కోసం బీఆర్ఎస్ సేన సిద్ధమవ్వాలి. కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుంది. పదేండ్లు పాలించిన బీఆర్ఎస్ సర్కార్ ఎన్నో అభివృద్ధి ఫలాలు ఇస్తే, ఏడాదిలోనే రాష్ట్రాన్ని కాంగ్రెస్ సర్వనాశనం చేసింది. దీనికి వచ్చే ఎన్నికల్లో రేవంత్ సర్కార్ తగిన మూ ల్యం చెల్లించుకుంటుంది.. కేసీఆర్ దీక్షతో వచ్చిన తెలంగాణలో మరోసారి దీక్షా దివస్ ఘనంగా నిర్వహించుకుందాం.

సూర్యాపేట సన్నాహక సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

విజయాల బీఆర్ఎస్.. మోసాల కాంగ్రెస్ : కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

తెలంగాణ ఉద్యమం నుంచి మొదలుకుంటే రాష్ట్ర సాధన, అనంతరం సాధించిన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి నడిపిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దే. బీఆర్ఎస్ విజయాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా నిలువగా ఉమ్మడి రాష్టంలోనైనా, నేటి అధికారంలో ఉండి అయినా కాంగ్రెస్ పార్టీ చేసేది మోసాలు తప్ప మరోటి లేదు. ఈ విషయాలను కూలంకషంగా నేటి యువతరానికి తెలియజేయాలి.

పిల్లలకు సీఎంగా కాకుండా ఉద్యమ నేతగా కేసీఆర్ తెలియదు : హుజూర్‌నగర్ ఇన్‌చార్జి ఒంటెద్దు నర్సింహా రెడ్డి

తెలంగాణలో కొద్ది మందికి కేసీఆర్ అంటే అభివృద్ధి చేశాడని, మరి కొందరికి సంక్షేమ పథకాలు చేశారని తెలుసు. కానీ ఉద్యమ నేతగా ఆయన ఏంటో ఆనాడు చిన్నపిల్లలుగా ఉన్న వారికి తెలియదు. అలాంటి వారికి ఉద్యమం, అనంతరం జరిగిన అభివృద్ధి గురించి తెలియాలి. తెలంగాణను ఎవ్వరూ ఇవ్వలేదు, రాజకీయ అనివార్యతతోనే వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వ రాక్షస పాలనకు వ్యతిరేకంగా యువతను జాగృతం చేసేందుకే రేపటి దీక్షా దివస్ ఓ వేదిక.

దీక్షా దివస్ రాష్ట్ర సాధనలో కీలక మలుపు : బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చెరుకు సుధాకర్



తెలంగాణ ఉద్యమ సమయంలో తాను పార్టీలోనే ఉన్నానని, ఆనాడు అన్ని వర్గాలు, మేధావులతో చేసిన చర్చలు, ఉద్యమ పంథా కోసం రూపొందించిన కార్యక్రమాలు, పదవులకు రాజీనామాలు ఇలా ప్రతి దానికి పగలు, రాత్రిని కరిగించడంతోనే తెలంగాణ వచ్చింది. కేసీఆర్ చేపట్టిన దీక్షా దివస్ అనేది రాష్ట్ర సాధనకు కీలక మలుపు. దీక్షతో ప్రజలు రోడ్లపైకి వచ్చి చేసిన ఉద్యమం కేసీఆర్‌కు మరింత బలాన్ని ఇచ్చింది. ఆ నాడు తాము ప్రజల కోసం, తెలంగాణ కోసం కోర్టు మెట్లు ఎక్కాము తప్ప ఓటుకు నోటుతో కోర్టు మెట్లు ఎక్కలేదు.

ఎన్నిపోరాటాలు జరిగినా.. కేసీఆర్ వల్లే సాధ్యమైంది : ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి



తెలంగాణ రాష్ట్రం కోసం ఎన్ని పోరాటాలు చేసినా అది కేసీఆర్ వల్లే సాధ్యమైంది. 1960 నుంచే రాష్ట్రం కోసం పోరాటాలు జరిగాయి. 1969లో ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఆ తర్వాత కూడా అనేక మంది పోరాటం చేసినా చివరికి కేసీఆర్ వల్లనే సాధ్యం అయింది. 14ఏండ్ల పాటు ఆయన ప్రణాళికా బద్ధంగా పోరాటం చేసినందునే రాష్ట్ర సిద్ధించింది.

అన్ని వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్ సర్కార్ : బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల కృష్ణారెడ్డి

కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడాది కాకముందే అన్ని వర్గాలను ఆగం చేసింది. రైతులకు రైతు బంధు ఇవ్వకుండా మోసం చేయడంతో పాటు ధాన్యం కొనుగోళ్లలో కూడా పారదర్శకత చూపించడం లేదు. నేడు రాష్ట్రంలో ప్రతి రైతు కాంగ్రెస్‌ను తిట్టి పోస్తున్నారు. రైతుగా కేసీఆర్ రైతుల బాధలు అర్థం చేసుకొని దగ్గరు తీస్తే రియల్టర్ అయిన రేవంత్ రియల్ రంగాన్ని మాత్రం కుదేలు చేశాడు.

విద్యా సంస్థల్లో కనీస వసతులూ కరువే..

- ఫర్నిచర్‌తోపాటు ల్యాబ్‌ల్లో కెమికల్స్, కిట్స్ కొరత
- విద్యా విధానం మారాలి.. విద్యా రంగాన్ని పట్టించుకోవాలి
- విద్యా కమిషన్ ఎదుట అధ్యాపకులు, విద్యార్థుల ఆవేదన
- విద్యా వ్యవస్థను పటిష్టం చేస్తామన్న కమిషన్ చైర్మన్ మురళి



సమావేశంలో మాట్లాడుతున్న విద్యా కమిషన్ చైర్మన్ మురళి, చిత్రంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, నవంబర్ 26 : 'విద్యా సంస్థల్లో కనీస వసతులు లేవు, కూర్చోవడానికి కుర్చీలు లేవు, ల్యాబ్‌ల్లో ప్రయోగాలు ఉండవు, అసలు కెమికల్స్ ఎలా ఉంటాయో కూడా తెల్వదు, కెరీర్‌పై అవగాహన కల్పించరు.. ఇలా ఉంటే ఎలా చదువుకునేది' అని విద్యార్థులు.. 'పాఠశాలలు, కళాశాలలకు నిర్వహణ నిధులు రావడం లేదు. విద్యాసంస్థల్లో స్వీపర్, స్కావెంజర్ లేక ఇబ్బంది పడుతున్నాం' అని ఉపాధ్యాయులు, అధ్యాపకులు.. 'ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని నూతన విద్యా విధానాన్ని అమలు చేయాలి. పిల్లలకు హైస్కూల్ నుంచే అన్ని రంగాలను పరిచయం చేయాలి. కంప్యూటర్ రంగంపైనా అవగాహన కల్పించాలి' అని తల్లిదండ్రులు.. ఇవీ మంగళవారం నల్లగొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో విద్యా కమిషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణలో ప్రస్తావనకు వచ్చిన అంశాలు. విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ఆధ్వర్యంలో నూతన విద్యా విధానం విద్యార్థిని వేదికగా చేసుకొని రూపొందించాలనే ఆలోచనతో నిర్వహించిన అభిప్రాయ సేకరణలో పలు విద్యా సంస్థల అధ్యాపకులు, ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. పలు విద్యా సంస్థల నుంచి వచ్చిన విద్యార్థులు శాంతి, ప్రసన్న కుమార్, అవినాష్, నస్రత్ అఫియా కమిషన్ ముందు తమ అభిప్రాయాన్ని తెలిపారు. కళాశాలల్లోనే ఇంటర్వ్యూలు ఏర్పాటు చేసి విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పేరెంట్స్ కనకయ్య, ఉజ్వల కమిషన్‌ను కోరారు.విద్యా సంస్థల నిర్వహణకు నిధులు ఇవ్వకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, స్వీపర్లు, స్కావెంజర్లు లేక పాఠశాలలు, కళాశాలలు అస్తవ్యస్తంగా తయారవుతున్నాయని డీఐఓ దస్రూనాయక్, ఎంజీయూ ప్రొఫెసర్ అంజిరెడ్డితోపాటు పలు కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, పాఠశాలల ఉపాధ్యాయులు రాజేశ్వర్, వేణుగోపాల్ కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. జూనియర్ కళాశాల విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం కల్పించడంతో ఇంటర్‌లో విద్యార్థుల సంఖ్య పడిపోకుండా ఉంటుందని తెలిపారు. అధ్యాపకులకు లేటెస్ట్ అంశాలపై శిక్షణ ఇవ్వాలని, కళాశాలల్లో మల్టీ డిసిప్లేనరీ కోర్సులు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో సమగ్ర విధానాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసిందని. ఇందులో భాగంగా అన్ని జిల్లాల్లో వివిధ స్థాయిల్లో అందరి అభిప్రాయాలు తీసుకొని విద్యా విధానాన్ని రూపొందిస్తామని అన్నారు. కలెక్టర్ ఆలా త్రిపాఠి, విద్యా కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ విశ్వేశ్వర్, వెంకటేష్, జ్యోత్స్నా రెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీఆర్వో అమరేందర్, ప్రతీక్ ఫౌండేషన్ చైర్మన్ గోనారెడ్డి, ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ ఉపేందర్ పాల్గొన్నారు.